సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 20 । జూన్ । 2024



దిగుబడి 'వెద'జల్లాలంటే..!

ఖరీఫ్‌లో వరి వెద సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు రావడంతో విత్తనాలను పొలంలో వెద జల్లుతున్నారు. - 8లో



సెంచూరియన్‌ను సందర్శించిన కేంద్ర బృందం - 8లో

నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీని భారత శాస్త్ర సాంకేతిక బృందం బుధవారం సందర్శించింది.



టీడీపీ కార్యకర్తల గూండాగిరి..!

గడిచిన ఐదేళ్లు ప్రశాంతంగా ఉన్న రాజాంలో అలజడి ప్రారంభమైంది. బొద్దాం గ్రామంలో టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహంతో గూండాగిరి ప్రదర్శించారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి గురుకులం మిగులు సీట్లకు ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 20, 21 తేదీల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఆ పాఠశాలల కన్వీనర్, ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల ఎంజేపీఏపీ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం 6, 8 తరగతులకు, శుక్రవారం 7, 9 తరగతులకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

అమ్మో.. ఏనుగులు!



గిజబలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: మండల ప్రజలను ఏనుగులు భయపెడుతున్నాయి. గ్రామాలకు సమీపంలో సంచరిస్తుండడంతో ప్రజలు భీతిల్లుతున్నారు. గిజబ, నందివానివలస, ఖడ్గవలస, సుంకి, సంతోషపురం గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి సంచరిస్తున్నాయి. గిజబ గ్రామంలోని పంటలను నాసనం చేశాయి. ఉపాధి హామీ సమాచార బోర్డులను ధ్వంసం చేశాయి. గ్రామంలోని మరడాన శ్రీనివాసరావుకు చెందిన బోరు పైపులను పీకిపడేశాయి. ఎప్పుడు ఏ గ్రామంలో ఎవరికి హాని చేస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ కావడంతో పొలం పనులకు బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు. ఏనుగుల తరలింపునకు టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో నిర్ధారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

విజయనగరం ఫోర్ట్: కేన్సర్ వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే నయం చేయడం సులభమని ఎన్‌సీడీ వైద్యాధికారి డాక్టర్ జి.మురళీ కృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పీహెచ్‌సీ వైద్యులు, ఎంఎల్ హెచ్‌పీలకు కేన్సర్, సుగర్, బీపీ వ్యాధుల నిర్ధారణ పరీక్షలపై బుధవారం శిక్షణ ఇచ్చారు. కేన్సర్ వ్యాధి చికిత్స విధానాలను వివరించారు. 30 ఏళ్లు దాటిన వారికి బీపీ, సుగర్ పరీక్షలు చేయాలని సూచించారు.

కార్మికులకు అండగా సామాజిక భద్రతా చట్టం

డెంకాడ: అసంఘటితరంగ కార్మికులు శ్రమ దోపిడీకి గురైతే సామాజిక భద్రతా చట్టం అండగా ఉందని ప్రజా ప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్ గౌరవ సభ్యుడు జి.దుర్గయ్య అన్నారు. మండలంలోని పినతాడివాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అసంఘటితరంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, కులవృత్తులు చేసేవారు శ్రమ దోపిడీకి గురవుతున్న తీరును వివరించారు. సమాజంలో గౌరవప్రదంగా, ఆర్థిక భద్రతతో కూడిన జీవించే హక్కుపై అవగాహన కల్పించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకల్యాణి మాట్లాడుతూ కార్మికులు, రైతుల సామాజిక భద్రత చట్టం-2008ను వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు, సేంద్రియ వ్యవసాయం జిల్లా అధికారి ఎం.ఆనందరావు మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో నేల సారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహల్దార్ రామారావు, ఎంపీడీఓ లవరాజు, మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల, గ్రామ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం

- ఎన్‌క్యూఏఎస్ ప్రతినిధులు డాక్టర్ జోసఫ్, డాక్టర్ అశోక్‌కుమార్

గంట్యాడ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ స్టాండర్డ్) ప్రతినిధులు డాక్టర్ జోసఫ్, డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. మండలంలోని నరవ హెల్త్ వెల్ నెస్ సెంటర్‌ను వారు బుధవారం పరిశీలించారు. అక్కడ రికార్డులను తనిఖీ చేశారు. రోజుకి ఎంత మంది ఏఏ వ్యాధులతో వస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ కె.ఎర్రన్న పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు.. పెట్టుబడి భరోసా ఏదీ!

- రైతుల ఖాతాలకు 'పీఎం కిసాన్' మొత్తం జమ
- పెట్టుబడి సాయంపై నేటికీ ప్రకటన చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్న చంద్రబాబు
- ఎదురుచూస్తున్న రైతాంగం
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటు రైతుభరోసా నిధులు ఒకేసారి..



ఖరీఫ్ పంటల సాగుకు భూమిని సిద్ధం చేస్తున్న రైతు

సాక్షి, పార్వతీపురం మన్యం:

అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతన్నలు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. భూములు దుక్కుచేసి విత్తనాలు జల్లేందుకు అనువుగా మలుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వీరికి కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం నుంచి తొలివిడత సాయంగా మంగళవారం రైతుల ఖాతాలకు రూ.2 వేలు చొప్పున జమ చేసింది. సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఈ మొత్తం కాస్త సహాయ పడుతుంది. జిల్లాలో 1,13,865 మంది రైతులకు రూ.22.77 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ య్యాయి. ఈ మొత్తం కేంద్ర వాటా కాగా.. రాష్ట్ర ప్రభుత్వ సహాయం కోసం రైతాంగం ఎదురుచూస్తోంది.

నాడు ఆరంభంలోనే పెట్టుబడి సాయం

సాగు పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆరంభంలోనే పెట్టుబడి సాయం(వైఎస్సార్ రైతుభరోసా) అందిస్తూ వారికి అండగా నిలిచేవారు. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తం అందించేవారు. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభం, కోతల సమయం, రబీ ఆరంభంలో గానీ, ధాన్యం ఇంటికి చేరే వేళ గానీ మూడు విడతలుగా అందించేవారు. వైఎస్సార్ రైతుభరోసా- పీఎం కిసాన్ కింద ఐదేళ్లలో జిల్లాలోని రైతులకు 885.69 కోట్లను అందించారు. భూయజమానులకు మాత్రమే పీఎం కిసాన్ వర్తించగా.. ఎటువంటి భూమీ లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలురైతులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్‌బోర్డు భూములను సేద్యం చేస్తున్న కౌలురైతులకూ వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించేది. ఏటా మే నెలలోనే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ తొలి విడత సాయం విడుదల చేసేది. దాంతోపాటే వైఎస్సార్ రైతు భరోసా పేరిట రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 సాయాన్ని రైతుల ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ చేసేవారు. ఎన్నికల కారణంగా ఈ ఏడాది ఆలస్యమైంది. తొలకరి పెట్టుబడులకు ఈ సాయం ఎంతగానో ఉపయోగపడేది.

గత ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ పథకం కింద విడుదలైన నిధులు ఇలా...

సంవత్సరం	రైతు కుటుంబాలు	జమైన నిధులు (రూ.కోట్లలో)
2019-20	1,07,729	145.43
2020-21	1,29,027	174.19
2021-22	1,34,657	181.79
2022-23	1,39,505	188.050
2023-24	1,46,016	196.236

మదుపులతోనే ఆరంభం

వ్యవసాయమంటేనే చేతిమదుపులతో ప్రారంభం అవుతుంది. ఖరీఫ్ సీజన్‌లో రైతు పంట పండించేందుకు ఎకరాకు కనీసం రూ.13 వేల వరకు పెట్టుబడి అవసరం. తొలుత పంట వేసేందుకు భూమి సిద్ధం చేయాలంటే దాదాపు మూడు దుక్కులు చేయాలి. ఎకరాలో గంట సమయం ట్రాక్టర్‌తో దుక్కి చేసేందుకు రూ.900 నుంచి రూ.1000 చెల్లించాల్సి ఉంటోంది. డిమాండ్‌కు అనుగుణంగా ఈ ధర పెరుగుతుంది. మూడు దశల్లో దుక్కి చేపట్టడానికి దాదాపుగా రూ.3000 పెట్టుబడి పెట్టాలి. గట్లు వేసేందుకు, కలుపు తీసేందుకు సగటు వేతనదారు కూలి రూ.300 నుంచి 500 వరకు అవుతోంది. ఇక్కడ కూడా రూ.2 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పొలం గట్లపై గాబు మందు వేసేందుకు మరో రూ.1500 ఖర్చు చేయాలి. వెదలు జల్లితే ఎకరాకు రూ.600 వరకు ఒక వేతనదారు వంతున ఇద్దరికి చెల్లించాల్సి ఉంది. ఇదే సమయంలో దుక్కి కూడా అవసరం ఉండడంతో మరో రూ.2 వేలు ఖర్చు చేయాలి. దీనికి తోడు పంట వేసిన 15 రోజుల్లోగా కలుపు నివారణ మందులకు వెచ్చించాలి. నారుమడులు సిద్ధం చేసి బురద దుక్కి దున్ని వేతనదారులతో నాట్లు వేయించాలంటే దాదాపు రూ.8వేలు పైబడి ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ లెక్కన సగటు రైతు పెట్టుబడులకే చేతిలో సొమ్ము లేక అప్పుల వైపు అడుగులు వేస్తున్నాడు. గడచిన నాలుగేళ్లల్లో ఐదు విడతల్లో నాటి ప్రభుత్వం మే నెలలోనే రైతు భరోసా పేరిట రూ.7,500లు అందించేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

రాష్ట్ర సాయం కోసం ఎదురుచూపు

ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ పనులను ముమ్మరం చేశారు. ఈ దశలో విత్తనాల కొనుగోలు, నారుమడుల తయారీకి రైతులకు సొమ్ములు అవసరమవుతున్నాయి. గతంలో పీఎం కిసాన్‌తో పాటు.. రైతు భరోసా ఒకేసారి అందడంతో పెట్టుబడి ఖర్చు కింద ఆ మొత్తం ఉపయోగపడేది. ఇప్పుడు రూ.2 వేలు మాత్రమే అందడంతో ఎటూ చాలదని రైతులు ఆవేదన చెందుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఐదు దస్త్రాలపై సంతకాలు చేశారు. రైతుల పెట్టుబడి సాయంపై మాత్రం సంతకం లేదు. ఎటువంటి ప్రకటనా చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మన్యంలో జ్వరాల వ్యాప్తి

- గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించండి
- డీఐఓకు విన్నవించిన సీపీఎం నాయకులు



జిల్లా ఇమ్యూనిటీ అధికారి నారాయణరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

పార్వతీపురం టౌన్: జిల్లాలోని గిరిజన గ్రామాల ప్రజలు జ్వరాలతో వణుకుతున్నారని, తక్షణమే వైద్యశిబిరాలు నిర్వహించి జ్వరాల వ్యాప్తిని కట్టడిచేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఇమ్యూనిటీ అధికారి నారాయణరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో వైరల్, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం కొమరాడ పీహెచ్‌సీలు, చినమేరంగి, పాలకొండ, సీతంపేట, భామినిలోని సీహెచ్‌సీలకు జ్వరపీడితుల సంఖ్య పెరిగిందన్నారు. భద్రగిరి పీహెచ్‌సీ పరిధిలోని చినమేరంగి, లావు ముఠాలో పది పంచాయతీల్లో జ్వరాల వ్యాప్తి అధికంగా ఉందని తెలిపారు. తక్షణమే ఊరూరా వైద్యశిబిరాలు నిర్వహించాలని, గిరిజనులకు దోమ తెరలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బంటుదాసు, గొర్లి వెంకటరమణ, పి.రాము, తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన అవసరం

విజయనగరం అర్బన్: విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై ప్రజలందరికీ అవగాహన అవసరమని డీఆర్వో ఎస్.డి.అనిత తెలిపారు. జాతీయ విపత్తుల బృందంతో తన చాంబర్‌లో బుధవారం మాట్లాడారు. విపత్తులపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇప్పటికే అవగాహన సదస్సుల కోసం షెడ్యూల్ రూపొందించామన్నారు. ఆ మేరకు సదస్సులకు ప్రజలు హాజరయ్యేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని గంట్యాడ, గజపతినగరం, నెల్లిమర్ల, విజయనగరం, పూసపాటిరేగ, భోగాపురం, సంతకవిటి, వంగర, బొబ్బిలి మండలాల ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డ్యూటీ ఎస్.కె.బెహర అధ్యక్షతన 16 మంది సిబ్బందితో కూడిన బృందం వరదలు, తుపాన్లు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, పిడుగులు పడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తారన్నారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన మంత్రి



ఏరియా ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సందర్శించారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రికి వెళ్లిన ఆమె, అక్కడి రోగులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న చికిత్స, అందుతున్న వైద్యసదుపాయాలపై ఆరా తీశారు. వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు. పక్కనే నిర్మాణమవుతున్న వందపడకల ఆస్పత్రిని పరిశీలించారు. ఈ పనులు తమ ప్రభుత్వంలోనే పూర్తిచేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఆమె వెంట పలువురు వైద్యారోగ్యశాఖ అధికారులు ఉన్నారు.

పేదల బియ్యం పక్కదారి!



బుడతానపల్లిలో వాహనంతో పట్టుబడిన పీడీఎస్ బియ్యం



చంద్రంపేట మిల్లు గోదాంలో పట్టుబడిన పీడీఎస్ బియ్యంపై విచారణ చేపడుతున్న అధికారులు (ఫైల్)

- టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలింపు
- గ్రామాల్లో కొనుగోలుచేసి రైస్ మిల్లులకు తరలిస్తున్న వ్యాపారులు
- గంట్యాడలో నెల రోజుల కిందట 10 టన్నుల బియ్యంతో లారీ పట్టివేత
- కొద్ది రోజుల కిందట చంద్రంపేట రైస్ మిల్లు గోదాంలో 2 టన్నుల బియ్యం సీజ్
- తాజాగా బుడతానవల్లిలో 1500 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం

గంట్యాడ: పౌరసరఫరాల శాఖ పేదలకు సరఫరా చేసిన బియ్యం పక్కదారి పడుతున్నాయి. పలువురు వ్యాపారులు పీడీఎస్ బియ్యం తక్కువ ధరకు ఇక్కడ కొనుగోలుచేసి పొరుగు రాష్ట్రం, జిల్లాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ వ్యాపారం జోరందుకోవడంతో అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. దాడులు ముమ్మరం చేశారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యంను సీజ్ చేస్తున్నారు.

బియ్యం స్వాధీనం ఇలా...

- గంట్యాడలో నెల రోజుల కిందట సుమారు 10 టన్నుల పీడీఎస్ బియ్యంతో వెళ్తున్న లారీని అధికారులు పట్టుకున్నారు.
- వారం రోజుల కిందట గంట్యాడ మండలం చంద్రంపేట గ్రామంలో ఉన్న రైస్ మిల్లు గోదాంకు పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో వీఆర్వో వెళ్లి రెండున్నర టన్నుల బియ్యాన్ని, తరలించే వాహనాన్ని సీజ్ చేశారు.
- తాజాగా మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో బుడతానపల్లి గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర మినీ మోడరన్ రైస్ మిల్లుకు పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. వెంటనే రెవెన్యూ అధికారులు మిల్లు వద్దకు చేరుకుని పీడీఎస్ బియ్యం తరలించే వాహనాన్ని పట్టుకున్నారు. బుధవారం ఉదయం గంట్యాడ సీఎస్‌డీటీ లగుడు జయలక్ష్మి, రాజాం సీఎస్‌డీటీ చిరంజీవి, ఎస్.కోట సీఎస్‌డీటీ శ్రీనివాస్, ఆర్ఐ హరిప్రియ, వీఆర్వో రవి దీనిపై విచారణ జరిపారు. వాహనంలో తరలిస్తున్నవి 1500 కేజీల పీడిఎస్ బియ్యంగా గుర్తించారు. రైస్ మిల్లుకు బియ్యం తరలించిన బెవర వెంకటప్పడు, మిల్లు యాజమాని మాటూరి అప్పలరాజుపై 6ఏ కేసు నమోదు చేశారు.

బియ్యం తరలిస్తే చర్యలు

> పేదలకు అందజేసే బియ్యాన్ని కొనుగోలు చేయకూడదు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్నవారు పట్టుబడితే 6ఏ కేసులు నమోదు చేసి జేసీ కోర్టులో హాజరుపర్చుతాం. బియ్యం మొత్తం సీజ్ చేస్తాం.
>
> – లగుడు జయలక్ష్మి, సీఎస్‌డీటీ, గంట్యాడ

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

గ్రామాల్లోని పేదప్రజల వద్ద చౌకగా కొనుగోలుచేసిన బియ్యాన్ని వ్యాపారులు మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి ఒడిశా రాష్ట్రంతో పాటు, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమంది మిల్లర్లు పీడీఎస్ బియ్యాన్ని మరపట్టి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

- రాష్ట్రంలో రౌడీ రాజకీయాన్ని అడ్డుకుంటాం
- టీడీపీ గెలుపును స్వాగతిస్తాం... హత్యారాజకీయాలను మాత్రం ప్రోత్సహించం
- బొద్దాం బాధితులను పరామర్శించిన మాజీ ఎంపీ బెల్లాన, రాజాం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్



రాజాం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరస్వామిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్టీ నేత తలే రాజేష్

రాజాం:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజలకు తామంతా ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అధైర్యపడొద్దని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ స్పష్టం చేశారు. టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి రాజాం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొద్దాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అగిరేడు వీరస్వామి, అలజంగి లక్ష్మణరావు, తదితరులను బుధవారం పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిబాబుతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. గ్రామంలోకి వచ్చి కుటుంబాలను కలుస్తామని తెలిపారు. ఈ సమయంలో మాజీ ఎంపీ వద్ద బొద్దాం గ్రామానికి చెందిన పలువురు గిరిజన మహిళలు వచ్చి మంగళవారం రాత్రి తమపై టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారని వాపోయారు. గ్రామంలో తాము ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటు రాజాంలోనూ, అటు రాష్ట్రంలోనూ మళ్లీ హత్యారాజకీయాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రజలు ఓటు వేసి గెలిపించినందుకు తామంతా గెలిచిన వారిని స్వాగతిస్తున్నామని, అత్యుత్సాహానికి వెళ్లి ఇలా దాడుల పాలనసాగిస్తే సహించేదిలేదన్నారు. తాము గత ఐదేళ్లు ఎంతో ప్రశాంతంగా, ప్రజాభిమానాన్ని పొంది పాలనసాగించామని, వీలైతే అలాంటి పాలనచేయాలని సూచించారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తామని, ఈ విషయాన్ని టీడీపీ శ్రేణులు మరచిపోవద్దన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు సంయమనంతో మెలగాలని సూచించారు.

తల్లికి వందనం ఏది బాబు?

టీడీపీ అధికారంలోకి వచ్చి పక్షం రోజులు గడుస్తున్నా తల్లికి వందనం (అమ్మఒడి) పథకంపై స్పష్టత లేదని, రైతు భరోసా డబ్బులు రైతులకు అందలేదని ఎంపీ బెల్లాన ఆరోపించారు. మెగా డీఎస్సీ అని చెప్పి మా ప్రభుత్వం ఇచ్చిన పోస్టులకు అదనంగా మరో పదివేలు పోస్టులు మాత్రమే జోడించారని, వాటిలో కూడా క్లారిటీ లేదన్నారు. నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18-50 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇచ్చే కార్యక్రమాల సంగతి ఏమిటని సీఎం చంద్రబాబునాయుడును ప్రశ్నించారు. ఇచ్చిన హామీల అమలుపై ముందుగా దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాల నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వాకముల్ల చిన్నంనాయుడు, నక్క శ్రీనివాసరావు, కామోదుల శ్రీరంగంనాయుడు, ఆల్తి రాంబాబు, ముగడ రవి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రంగంవలసలో ఏనుగుల బీభత్సం



రంగంవలస పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

సీతంపేట: మండలంలోని రంగంవలస పరిసర ప్రాంతాల్లో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. మూడు రోజులుగా ఇక్కడ తిష్టవేసిన నాలుగు ఏనుగులు కొండచీపుళ్లు, జీడి, అరటి వంటి పంటలను నాశనం చేస్తున్నాయని గిరిజనులు తెలిపారు. ఏనుగుల ఘీంకారానికి రాత్రి సమయంలో నిద్ర ఉండడం లేదని వాపోయారు. కొండపోడు పనులకు వెళ్లాలంటే భయం వేస్తోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖాధికారుల జాడలేదని తెలిపారు.

సాగు పట్టాలు ఇప్పించండి

- గిరిజనుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

పార్వతీపురంటౌన్: తాము సాగు చేస్తున్న భూములకు సాగు పట్టాలు ఇప్పించండంటూ గిరిజన గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్వతీపురం మండలంలోని సంగంవలస పంచాయతీ లోగల సీతంపేట 20 కుటుంబాల గిరిజనులు, గంగాపురం పంచాయతీ తాన్నవలస, తొక్కుడువలస, వెలగవలస పంచాయతీ వెలగవలస గ్రామం, సందివలస, ములగ, దోనిగెడ్డవలస, డోకిశీల పంచాయతీ తేలునాయుడువలస, ములగ పంచాయతీ, ఏడీవలస గిరిజనులు, గ్రామస్తులు తమ సమస్యలను తహసీల్దార్‌కు విన్నవించారు. తాము సాగుచేస్తున్న భూములకు సర్వే పూర్తయింది కానీ పట్టాలు మంజూరు చేయలేదన్నారు. ఐదు పంచాయతీ గ్రామాల ప్రజలకు పట్టాలు ఇప్పించాలని కోరారు.

నీట్ పరీక్ష ఫలితాలపై న్యాయవిచారణ జరిపించాలి

- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర జిల్లా ప్రధానకార్యదర్శి నాగభూషణం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

బొబ్బిలి: దేశంలోనే సంచలనం సృష్టించిన నీట్ పరీక్షా ఫలితాల్లో అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక గంటి ప్రసాదం స్మారకభవనంలో ఏఐఎస్‌ఎఫ్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షా ఫలితాలపై న్యాయవిచారణ జరిపించాలని లేని పక్షంలో పోరుబాట పడతామని స్పష్టం చేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర విద్యా, రాజకీయ శిక్షణ తరగతులను జూలై 8 నుంచి 10వ తేదీవరకు కాకినాడలో నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రావణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి–గజపతినగరం మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే ఎస్సై రవివర్మ, కానిస్టేబుల్ ఈశ్వరరావు బుధవారం తెలిపారు. సుమారు 45 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి రైలులో ప్రయాణిస్తూ కాలు జారి పడిపోయాడా? లేదా పట్టాలు దాటుతుండగా రైలు కింద పడి మృతి చెందాడా? అన్నది తెలియాల్సి ఉందన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది ఫోన్ 94906 17089, 9491813163 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

దిగుబడి 'వెద'జల్లాలంటే..!



వెద జల్లేందుకు భూముల్లో సమాంతర దుక్కు చేసిన రైతులు



పాలకొండ మండలంలోని రాజుపేట వద్ద వరి వంగడాలను వెద జల్లుతున్న రైతులు

- వ్యవసాయంలో వెద సాగుపై కర్షకుల ఆసక్తి
- వరి నాట్లకు ప్రత్యామ్నాయం
- సాధారణ పంట కాలం కంటే పది రోజులు ముందు
- పెట్టుబడులు తక్కువ..లాభాలు ఎక్కువ
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పాలకొండ రూరల్: ప్రస్తుత ఖరీఫ్‌లో రుతుపవనాల అనుకూలతతో తొలకరి వర్షాలు పలకరిస్తున్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు పొలంబాట పడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 73 వేల హెక్టార్లలో సాగు లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోంది. ఈ క్రమంలో ఏటా 17వేల హెక్టార్లకు పైబడి వెదజల్లే పద్ధతిని రైతులు అనుసరిస్తున్నారు. రైతుల అవసరాల మేరకు 26,416 క్వింటాళ్ల వరి వంగడాలు, 45.276 మెట్రిక్ టన్నుల ఎరువులను అందించేలా 2024 ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు.ఈ మేరకు 306 ఆర్‌బీకేల ద్వారా రైతు ముంగిటకు సీజన్‌కంటే ముందుగానే విత్తనాలు, ఎరువులు అందించేలా కసరత్తు చేపట్టారు.

మన నేలలు అనుకూలం..

వెదజల్లే ముందు భూమి సమాంతరంగా ఉండేలా దమ్ము చేయాల్సి ఉంటుంది. ఈ పద్ధతిలో సాంద్రత ప్రధానంగా ఉండేలా విత్తనాలు వేసుకోవాలి. మొదటి ఆకు విచ్చుకుని, పచ్చబడే వరకూ పొలంలో బురదపదును ఉండేలా జాగ్రత్త పడాలి. పలుచటి నీటి తడులు అందించాలి. 35 రోజుల తరువాత నీటి తడులు అందాల్సి ఉంటుంది. సాధారణ పద్ధతిలో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి. ఈ విధానంలో నారు పెంచడం, ఆకుతీత, ఉడుపులు ఉండవు. దీంతో ఎకరాకు సుమారు రూ.5వేల మేరకు పెట్టుబడి తగ్గుతుంది.

తక్కువ నీటితో..

ఈ విధానంలో నీటి యాజమాన్యం కీలకం. వెదలు వేసిన పొలంలో నీటి నిల్వలు ఉండకుండా చూడాలి. నీరు నిలిస్తే మొలక శాతం తగ్గుతుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సేద్యం చేయవచ్చు. ఈ పద్ధతి వల్ల పొలంలో మొక్కకు సూర్యరశ్మి, గాలి పుష్కలంగా సమకూరుతుంది. దీంతో చీడపీడల బెడద తగ్గి సస్యరక్షణ ఖర్చు తగ్గుతుంది. కిలో విత్తనాలకు ఒక గ్రాము బావిస్టిన్ పొడి లేక 3 గ్రాముల సూడోమోనాస్ లీటరు నీటిలో కలిపి 24 గంటల పాటు విత్తనాలు నానబెట్టాలి. తర్వాత మరో 24 గంటలు వాటిని గోనె సంచిలో వేసి మండీకట్టి వెదజల్లడం శ్రేయస్కరం. బంక నేలల్లో దమ్ము చేసిన మరుసటి రోజు వెదజల్లాలి లేకుంటే డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేయవచ్చు. ఇసుక శాతం అధికంగా ఉండే నేలల్లో వెదలు వేసిన రోజు దమ్ము చేయాలి. తేలికపాటి నీటి తడులు ఉండేలా చూడాలి. భూసార పరీక్షలకు అనుగుణంగా సీజన్‌లో నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ఎరువులను అధికారుల సూచన మేరకు వాడాల్సి ఉంటుంది.

కలుపు యాజమాన్యం..

వెదజల్లిన 48 గంటలలోపు కలుపు నివారణ నిమిత్తం పిండిమిథాలిన్ వేయాలి. 15–20 రోజుల మధ్య పొలంలో ఊదా మొదలగు కలుపు ఎక్కువగా ఉంటే పొలంలో నీటి నిల్వలు లేకుండా చేసి సైహలోఫాస్ బ్యూటైల్ 400 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డి జాతి, వెడల్పు ఆకుల కలుపు లేదా రెండూ ఉన్నట్లు గుర్తిస్తే బిస్పైరిబాక్స్ సోడియం 100–120 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది. నెల రోజులకు వెడల్పు ఆకు కలుపు అధికంగా ఉంటే పొలంలో నీరు బయటకు పంపి (2–4డి) సోడియం సాల్ట్ 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలపి పిచికారీ చేయాలి. పొలం ఎరుపు రంగులో కనిపిస్తే యూరియా తగు మోతాదులో వేయాలి. సన్నజాతి గడ్డి నివారణకు ఫేనాక్సీ–ప్రాప్–పి–ఇథల్ 6.9శాతం 250 ఎంఎల్ 2వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా సమర్థవంతంగా కలుపు నివారణ చేయవచ్చు.

వాతావరణ సానుకూలతతో వెదలు..

ప్రస్తుత వాతావరణ పరిస్థితిని ఆసరాగా చేసుకుని వరి సాగులో నారుమడులు వేయకుండా నేరుగా విత్తనాలు వేసే(వెదజల్లు) విధానాన్ని రైతులు అనుసరిస్తున్నారు. గత ఏడాది 17.58వేల హెక్టార్లలో వెద వేసిన రైతులు ఈ ఏడాది దాదాపు 18వేల హెక్టార్లలో ఈ విధానం అవలంబించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఈ ప్రక్రియతో ఎకరాకు దాదాపు 12 నుంచి 15 కిలోల విత్తనాలు ఆదా చేయవచ్చు. పెట్టుబడుల భారంతోపాటు సాగునీటి ఇబ్బందులు అధిగమించవచ్చు. పంట దిగుబడి సుమారు పదిరోజులు ముందుగా చేతికి వస్తుంది. నారు సకాలంలో అందక ఉడుపులు చేయలేకపోవడం, వ్యవసాయ కూలీల ఇబ్బందులు ఉండవు.

రైతులకు లాభదాయకం



వెదలు వేసే విధానం రైతులకు లాభదాయకం. సాగునీటి ఇబ్బందులు, అధిక పెట్టుబడులు ఉండవు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల బెడద తట్టుకుంటుంది. దిగుబడి పెరుగుతుంది. పంట కాలం తక్కువ. ఈ విధానాన్ని అవలంబించడం శ్రేయస్కరమే. ఇప్పటికే పలుచోట్ల రైతులు వెదలు వేశారు. వెద సాగుపై రైతులకు గ్రామస్థాయిలో అవసరమైన సలహాలను వ్యవసాయ సహాయకులు అందిస్తున్నారు.

కె.రత్నకుమారి,
వ్యవసాయశాఖ ఎ.డి., పాలకొండ

ఆన్‌లైన్‌లో ఆర్డర్: బిర్యానీలో పురుగులు

- రెస్టారెంట్‌పై కేసు నమోదు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగుల్‌మీరా

విజయనగరం: నగరంలోని పలు రెస్టారెంట్‌లలో విక్రయించే ఆహారపదార్థాల్లో నాణ్యతలోపం మరోసారి బట్టబయలైంది. హరీష్ అనే వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు రెస్టారెంట్‌ను పరిశీలించిన ఫుడ్ సెఫ్టీ అధికారులు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన హరీష్ రింగ్‌రోడ్ ప్రాంతంలో గల క్రితుంగా రెస్టారెంట్‌లో ఉలవచారు బిర్యానీ కావాలంటూ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. ఇంటికి వచ్చిన ఆర్డర్‌ను తెరిచి చూడగా..పార్సిల్‌లో పురుగులు కనబడడంతో అవాక్కాయ్యాడు. ఈ ఘటనపై ఫుడ్ సెఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయటంతో పాటు స్పందించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగుల్ మీరా రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించి..కిచెన్‌లో అపరిశుభ్ర వాతావరణంలో వంటకాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వాస్తవానికి వినియోగించే వంట నూనెలో టోటల్ పోలార్ కాంపౌడ్స్ మోతాదు 25లోపు ఉండాల్సి ఉండగా..38 శాతం ఉన్నట్లు ధ్రువీకరించారు. ఇటువంటి కలుషిత నూనెలతో తయారు చేసిన ఆహారాన్ని తింటే గ్యాస్ట్రిక్, క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశాలున్నాయని హెచ్చరించారు. అనంతరం సదరు రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. హోటళ్లు, రెస్టారెంట్‌లలో కల్తీ ఆహారాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించిన వారు ఫోన్ 8790603489 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సెంచూరియన్‌ను సందర్శించిన కేంద్ర బృందం



కేంద్ర బృంథ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని భారత శాస్త్ర సాంకేతిక బృంద ప్రతినిధులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీలోని టిష్యూ కల్చర్ ప్లాంట్‌ను పరిశీలించి ఆరా తీశారు. ఈ కేంద్ర బృందానికి నేతృత్వం వహించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కవి కిశోర్ టిష్యూ కల్చర్ ప్లాంట్ గురించి వివరించారు. టిష్యూ కల్చర్ ప్లాంట్ వల్ల రైతులకు ఎక్కువగా ప్రయోజనం ఉంటుందన్నారు. లక్షల్లో అరటి మొక్కలను ఉత్పత్తి చేయడం వల్ల అటు రైతులకు ప్రయోజనంతో పాటు ఇటు వర్సిటీకి ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం ల్యాబ్ పరికరాలను సందర్శించిన బృంద ప్రతినిధులు పాటిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీసీ పీకే మహంతి, డీన్‌లు పుష్పలత, డాక్టర్ సుమన్, డాక్టర్ అనిత, ఐటీఓఆర్ ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ సుజాత, న్యూఢిల్లీ డీబీటీ ఎన్‌సీఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ శ్రీ వాత్సవ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

గంట్యాడ: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ఎస్‌ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారులు పట్టుకున్నారు. మండలంలోని చంద్రంపేట గ్రామంలో ఓ మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం రాత్రి ఎస్‌ఈబీ అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఆమె దగ్గర నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో భార్గవి ప్రతిభ



సాధించిన పతకాలు చూపిస్తున్న భార్గవి

నెల్లిమర్ల రూరల్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 17 నుంచి జరుగుతున్న అస్మిత ఖేలో ఇండియా ఉమెన్ ర్యాంకింగ్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి ప్రతిభ కనబరిచింది. నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ భార్గవి 49 కిలోల విభాగంలో..స్నాచ్ 68 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 85 కిలోలు..మొత్తంగా 153 కిలోల బరువు ఎత్తి యూత్ కేటగిరీలో రజత పతకం, జూనియర్ విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన భార్గవికి రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మీదింషా బాబు, వెంకట్రామయ్య, జిల్లా అసోషియేషన్ ప్రతినిధులు నాగలక్ష్మి, చల్లా రాము, తదితరులు అభినందనలు తెలిపారు.

చీపురుపల్లి ఆదిత్య జూనియర్ కాలేజీ గుర్తింపు రద్దు

- ఆర్‌ఐఓ మజ్జి ఆదినారాయణ ప్రకటన

విజయనగరం అర్బన్: చీపురుపల్లి పట్టణంలోని శివం జంక్షన్‌లో గల ఆదిత్య జూనియర్ కాలేజీకి గుర్తింపును 2024–25 విద్యా సంవత్సరం నుంచి రద్దు చేసినట్లు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్‌ఐఓ) మజ్జి ఆదినారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతి లేనందున విద్యార్థులు చేరవద్దని సూచించారు. ఇప్పటికే రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు బదిలీ సర్టిఫికెట్ తీసుకుని మరో గుర్తింపు పొందిన కళాశాలలో చేరి ఇంటర్మీ డియట్‌ను పూర్తి చేయాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి కౌన్సెలింగ్



సీటు కేటాయింపు పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ టీవీ గిరి, తదితరులు

విజయనగరం రూరల్: 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 28 పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో (ఐటీఐ) ప్రవేశాలకు బుధవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, రాజాం ప్రభుత్వ ఐటీఐలలో 652 సీట్ల భర్తీకి గాను తొలిరోజు కౌన్సెలింగ్‌కు 89 మంది హాజరు కాగా 76 మందికి సీట్లు కేటాయించారు. ఐటీఐలలో సీట్లు పొందిన అభ్యర్థులకు ఐటీఐల జిల్లా కన్వీనర్, విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ నెల 26 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ కొనసాగనుందని, ర్యాంకుల వారీగా అభ్యర్థులు హాజరు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐటీఐ టీవో రామాచారి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వృద్ధుడి ఆత్మహత్య



రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడు

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి ఫ్లైఓవర్ వద్ద గల రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వృద్ధుడు (60) ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్సై రవివర్మ బుధవారం తెలిపారు. విజయనగరం నుంచి కొత్తవలస వైపు వెళ్లే రైల్వే ట్రాక్‌పై గుర్తు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. మృతుడి శరీరంపై తెల్లషర్టుపై నల్లటి గడులు గల షర్ట్, హాఫ్ ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. మృతుడు స్థానిక వ్యక్తేనని అంచనా వేశారు. శవ పంచనామా నిర్వహించి విజయనగరం రైల్వే ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఎస్సై తెలిపారు.

22న పాలకొండలో జాబ్ మేళా

పార్వతీపురం: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించే నిమిత్తం అపోలో టైర్స్‌లో 150 ఉద్యోగాలు, మోడలేజ్ ఇండియా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 80 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నారని జిల్లా ఉపాధి అధికారి ఆర్.వహీదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 22వ తేదీన పాలకొండ డిగ్రీ కళాశాలలో ఉదయం 10:30 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అపోలో టైర్స్ సంస్థలో 150 నేషనల్ అప్రెంటిస్ షిప్ ప్రమోషన్ స్కీమ్ (ఎన్‌ఏపీఎస్) ఉద్యోగాలకు 18 నుంచి 23 సంవత్సరాల వయస్సు కలిగి 2020–24బ్యాచ్‌కు చెంది, ఏదైనా డిప్లమా, బి.టెక్, డిగ్రీ విద్యార్హత కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ఉద్యోగం కల్పించి, రూ.16 వేల జీతంతోపాటు ఫుడ్, ట్రాన్స్‌పోర్ట్, హాస్టల్ సదుపాయం కల్పిస్తారని తెలిపారు. మోడలేజ్ ఇండియా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 80 ట్రైనీస్ ఉద్యోగాలకు 18 నుం చి 21 సంవత్సరాల వయస్సు కలిగి, ఇంటర్మీడియట్‌లో 50శాతం ఉత్తీర్ణత సాధించిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు తిరుపతి జిల్లాలోని శ్రీ సిటీలో ఉద్యోగం కల్పించి, రూ.15 వేల జీతంతో పాటు ఫుడ్, ట్రాన్స్‌పోర్ట్, హాస్టల్ సదుపాయం ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్//ఎంప్లాయ్‌మెంట్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్ట్ ఫొటోలతో జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9908827160 నంబర్‌ను సంప్రదించవచ్చునని సూచించారు.

టీడీపీ కార్యకర్తల గూండాగిరి..!

- గిరిజనుల ఇళ్లపై దాడి
- గ్రామదేవత ఉత్సవాల పేరుతో ఊరేగింపు
- జలజీవన్‌మిషన్ శిలాఫలకాల ధ్వంసం
- భయాందోళనలో గ్రామస్తులు



బొద్దాంలో జలజీవన్ మిషన్ శిలాఫలకాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్న టీడీపీ కార్యకర్తలు



బాధితులతో కలిసి రాజాం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీకి ఫిర్యాదుచేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: గడిచిన ఐదేళ్లు ప్రశాంతంగా ఉన్న రాజాంలో అలజడి ప్రారంభమైంది. మండలంలోని బొద్దాం గ్రామంలో టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహంతో గూండాగిరి ప్రదర్శించారు. గ్రామదేవత ఉత్సవాల పేరుతో ఈనెల 18న ఊరేగింపు చేపట్టారు. రాత్రి 9 గంటల సమయంలో డీజే సౌండ్స్‌తో వీధుల్లో పర్యటించారు. తొలుత గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆనుకుని ఉన్న జలజీవన్ మిషన్ శిలాఫలకాల రచ్చబండను ధ్వంసంచేసే ప్రయత్నం చేశారు. అక్కడే పహారా కాస్తున్న రాజాం పోలీసులు అడ్డుకున్నప్పటికీ వారి అత్యుత్సాహాన్ని విడిచిపెట్టలేదు. శిలాఫలకంపై రాజకీయనాయకుల ఫొటోలను, ఫ్లోరింగ్ పలకలు ధ్వంసం చేశారు.

ఇళ్లలో చొరబడి మహిళలపై దాడి..

ఈ క్రమంలో ఊరేగింపు చివరిలో గిరిజనుల ఇళ్లలో టీడీపీ కార్యకర్తలు చొరబడినట్లు గిరిజన సంక్షేమ సంఘం రాజాం మండల కన్వీనర్ మేకల లక్ష్మణదొర తెలిపారు. ఎస్టీకాలనీలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న వారి ఇళ్లలో చొరబడి మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ఒకరిద్దరు విద్యార్థినులపై దాడి చేశారని తెలిపారు. ఈ దాడుల్లో గాయపడిన బాధితులు రాజాం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తలపై డీఎస్పీ శ్రీనివాసచక్రవర్తికి ఫిర్యాదు చేశారు. చివరకు పోలీస్‌స్టేషన్ వద్ద కూడా టీడీపీ కార్యకర్తలు రాద్ధాంతం చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. టీడీపీ కార్యకర్తలు దాడులకు దిగుతున్నారని, తమకు ప్రాణహాని ఉందని ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు చెందిన చిత్తాడ పార్వతి, పాముల అనురాధ, గుమ్మడి ప్రసాద్‌లతో పాటు ఈ దాడుల్లో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బుధవారం మరోమారు పోలీసులకు ఫిర్యాదుచేశారు.



టీడీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన ఫ్లోరింగ్

గట్టి బందోబస్తు ఏర్పాటు చేయండి

బాధితులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని డీఎస్పీని కోరారు. తాము గత ఐదేళ్లు పాలనచేశామని, ఇటు రాజాంలోనూ, అటు రాష్ట్రంలో ఎక్కడా కూడా ఇటువంటి దాడులు జరగలేదని గుర్తుచేశారు. రాజాంలో మళ్లీ హత్యారాజకీయాలు ప్రారంభమయ్యే పరిస్థితి కనిపిస్తోందని, ప్రశాంత వాతావరణాన్ని ఏర్పాటుచేయాలని సూచించారు. బొద్దాంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేయాలని కోరారు. దాడులకు పాల్పడిన టీడీపీ కార్యకర్తలపై కఠినచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం పట్టణ, మండల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.